


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 27-02-2025 సంపుటి : 06 సంచిక : 290 పేజీలు : 8 వెల : రూ 1-00






శ్రీశైలం : శ్రీశైల మహాక్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మల్లన్నను దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి నుంచే పాతాళగంగ వద్ద సాన్నాలు చేసుకొని ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాల కోసం క్యూలైన్లలో బారులు తీరారు. టైంస్లాట్స్ ప్రకారం.. నిర్ణీత క్యూలైన్ల ద్వారానే దర్శనానికి భక్తులను అనుమతిస్తున్నారు. కంపార్ట్‌మెంట్లలో ఉన్న భక్తులు మంచినీళ్ల కోసం ఇబ్బందులుపడ్డారు. నీటి కోసం స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్లు చేశారు. దాంతో వారంతా ఇబ్బందులు లేకుండా ఇరుముడి సమర్పించి.. స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. శివదీక్షా శిబిరాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కూడా అర్చకులు దీక్షా విరమణలు చేస్తున్నారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను దుర్వినియోగం





చేయొద్దని ఈవో శ్రీనివాసరావు కోరారు. జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి శ్రీశైల మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు కన్నడ భక్తులు ఆయన ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం క్షేత్ర పురవీధుల్లో పల్లకీపై ఊరేగిస్తూ భజనలు చేశారు. ఆలయ దర్శనానికి వచ్చిన ఆయనకు ఈవో శ్రీనివాసరావుతో పాటు వేదపండితులు ఘన స్వాగతం పలికారు. ఉభయదేవాలయాలతో పాటు పరివార దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. జ్యోతిర్లింగ, శక్తిపీఠం కలిసి ఒకేచోట వెలసిన మహిమాన్విత క్షేత్రమే శ్రీశైలమని పేర్కొన్నారు.

## రాష్ట్రానికి అన్ని రకాలుగా సహాయం అందించాలి: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: ఎస్ఎల్ బిసి ప్రమాద ఘటనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడికి వివరించానని తెలియజేశారు. మోదీతో గంటపాటు సిఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై ప్రధానితో రేవంత్ చర్చించారు. తెలంగాణలో చేపట్టిన పలు ప్రాజెక్టులకు కేంద్ర సాయం చేయాలని, విభజన చట్టం లోని పెండింగ్ సమస్యలను పూర్తి చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా సాయం అందించాలని కోరారు. కేంద్ర బడ్జెట్ లోనూ రాష్ట్రానికి కేటాయింపులు లేవని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని, మూసీ నది ప్రక్షాలనకు కేంద్రం సహకరించాలని, దీంతో పాటు రాష్ట్రంలోని చెరువుల పునరుద్ధరణకు ఆర్థిక సాయం చేయాలని రేవంత్ రెడ్డి మోడీని కోరారు.

## దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం



ఉండవల్లిః మంగళగిరి చినకాకాని వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఆసుపత్రి భవన నమూనాపై అధికారులతో మంత్రి సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవన నమూనాను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు

**ప్రశాంత వాతావరణంలో వైద్యులు పనిచేసేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి**
**మంగళగిరి ప్రజలకు అత్యుత్తమ వైద్యం అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి**
**ఆసుపత్రి భవన నమూనాపై అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష**

సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. మంగళగిరి ప్రజల 30 ఏళ్ల కల వంద పడకల ఆసుపత్రి. అత్యాధునిక వసతులతో వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దాలి. వంద పడకల విభాగంలో దేశానికి రోల్ మోడల్ గా ఆసుపత్రి నిలవాలి. ప్రశాంత వాతావరణంలో వైద్యులు పనిచేసేలా ఉండాలన్నారు. రోగులకు అత్యుత్తమ వైద్యం అందిం చేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందేందు కు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. డాక్టర్లు, పేషంట్లు, విజిటర్స్ కోణంలో జోన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. పేరెన్నికగన్న ఆసుపత్రు ల భవన నమూనాలను పరిశీలించి అందకనుగుణంగా మార్పులు, చేర్పులు చేయాలన్నారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు. పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాను రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ ఐడీసీ(ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) సీఈ జి.సుధాకర్ రెడ్డి, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, భార్గవ్ గ్రూప్ చీఫ్ ఆర్కిటెక్చర్ శ్రీమతి నిఖిల, ఏపీఎంఎస్ఐడీసీ డీఈఈ ఎమ్. హనుమంతరావు నాయక్, ఏఈ జి.గోపీచంద్, ఏఈ కె.శివ సత్యనారాయణ, భార్గవ్ గ్రూప్ డీజీఎమ్ ఏ.శ్యామ్ కిషోర్, సీనియర్ ఇంజనీర్ డి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడులో వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వమే : అమిత్ షా



న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమిళనాడు లోని స్టాలిన్ సర్కారు పై నిప్పులు చెరిగారు. బుధవారం ఆ రాష్ట్రంలోని కోయంబత్తూరు, తిరువన్నమలై, రామనాథపురం జిల్లా కేంద్రాల్లో బీజేపీ కార్యాలయాలను ప్రారంభించిన అనంతరం పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా మాట్లాడారు. డీఎంకే అవినీతి పార్టీ అని, అవినీతిపరులంతా ఆ పార్టీలోనే ఉన్నారని విమర్శిం చారు. అవినీతి కేసుల్లో డీఎంకే నేతలు మాస్టర్ డిగ్రీలు చదివారని అమిత్ షా మండిపడ్డారు. వాళ్ల నాయకుల్లో ఒకరు క్యాష్ ఫర్ జాబ్స్ కేసులో, మరొకరు మనీ లాండరింగ్, అక్రమ ఇసుక తవ్వకం కేసులో, ఇంకొకరు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఉన్నారని చెప్పారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు నిధులు ఇవ్వడం లేదని సీఎం స్టాలిన్ చేసిన ఆరోపణలను కూడా షా ఖండించారు. గత ఐదేళ్లలో తమిళనాడుకు కేంద్రం ఐదు లక్షల కోట్లు ఇచ్చిందని చెప్పారు. తమిళనాడులో అవినీతిని అంతమొందించడమే బీజేపీ లక్ష్యమని షా వ్యాఖ్యానించారు. 2026లో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏదే విజయమని, ఇక్కడ ఎన్డీఏ సర్కారు కొలువుదీరుతుందని జోస్యం చెప్పారు. జాతి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని రాష్ట్రం నుంచి పారదోలాలని అన్నారు.

## దోషులైన నేతలపై జీవిత కాల నిషేధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: వివిధ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాల నిషేధాన్ని విధించాలన్న అభ్యర్థను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఆరేళ్ల పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది కఠినతరమని పేర్కొంది. అయితే రాజకీయ నేతలపై జీవిత కాల నిషేధం ఎన్నేళ్లు అనే దానిపై నిర్ణయాధికారం పార్లమెంట్ దేనని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఖరాకండిగా తేల్చి చెప్పింది. దోషులుగా రుజువు అయితే జీవితకాల నిషేధాన్ని విధించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వివరిస్తూ.. సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈనేపథ్యంలోదీనిపైస్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఆ క్రమంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తాజాగా తన అభిప్రాయాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది.



## గోదావరి స్నానానికి వెళ్లి ఐదుగురు మృతి..

### మహాశివరాత్రి వేళ విషాదం

మహాశివరాత్రి వేళ గోదావరి స్నానానికి వెళ్లి గల్లంతైన యువకుల కథ విషాదాంతమైంది. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు సమీపంలోని తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరి నదిలో మునిగి ఐదుగురు దుర్మరణం చెందారు. వారిని రక్షించేందుకు రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది.. యువకుల మృతదేహాలను వెలికితీయడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. తాడిపూడికి చెందిన 11 మంది యువకులు కొవ్వూరు, తాళ్లపూడి, రాజమండ్రిలో ఇంటర్, డిగ్రీ చదువుతున్నారు. మహాశివరాత్రి కావడంతో బుధవారం ఉదయం ఆ యువకులు గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఆ నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో ఒకరు నీటిలో మునిగిపోయారు. స్నేహితుడిని రక్షించే క్రమంలో ఇంకొకరు.. అలా



ఒకరినొకరు రక్షించుకునే క్రమంలో ఐదుగురు గల్లంతయ్యారు. యువకులు గల్లంతైన విషయం తెలియగానే పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో నదిలో వెతికించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్, ఇతర సహాయ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. కానీ లాభం లేకపోయింది. నీటిలో గల్లంతైన ఐదుగురిలో ఒక్కరిని కూడా ప్రాణాలతో కాపాడలేకపోయారు. గంటల తరబడి శ్రమించి వారి మృతదేహాలను మాత్రమే బయటకు తీసుకురాగలిగారు. మృతులను తిరుమల శెట్టి పవన్(17), పడాల దుర్గాప్రసాద్(19), అనిసెట్టి పవన్(19), గర్రె అకాశ్(19), పడాల సాయి కృష్ణ (19)గా గుర్తించారు. మహాశివరాత్రి వేళ ఐదుగురు యువకులు మరణించడంతో తాడిపూడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## 2026 ఎన్నికల్లో చరిత్ర తిరగరాస్తాం: విజయ్



హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో తామే గెలుస్తామని సినీ నటుడు, టీవీకే చీఫ్ దళపతి విజయ్ ధీమా వ్యక్తం చేశారు. మహాబలిపురంలో టీవీకే పార్టీ మహానాడులో ఆయన మాట్లాడారు. 2026 ఎన్నికల్లో చరిత్ర తిరగరాస్తామని చెప్పారు. పెత్తందార్లు, భూస్వాములు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో గెలిచి సామాన్యులకు రాజ్యాధికారం కల్పిస్తామన్నారు. త్వరలోనే పార్టీలోకి కీలక నేతల చేరికలు ఉంటాయని తెలిపారు.

# సంపాదకీయం

గురువారం 27-02-2025

## సోషల్ ఇన్ ఫ్లూయెర్స్ కు దిమ్మ తిరిగే షాక్...

సోషల్ మీడియాలో లక్షలాది ఫాలోవర్స్, సబ్ స్రైబర్స్ ఉన్న వాళు తాము ఏది చేసినా చెల్లుతుంది అనుకుంటున్నారు. ఆడిందే ఆట పాడిందే పాట.. అడిగేవారు ఎవరూ లేరనుకుంటున్నారు. రాత్రికి రాత్రే ఫుల్ డబ్బులు సంపాదించాలనుకుంటున్నారు. అందుకే బెట్టింగ్ యాప్స్ ను గేమింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారు. నిజానికి ఏపీ, తెలంగాణలో ఆన్ లైన్ బెట్టింగ్స్, గేమింగ్స్ పై బ్యాన్ ఉంది. అయినా సరే ఈ బ్యాన్ మమ్మల్ని ఏం చేస్తుందని అనుకుంటున్నారు. ఎవరికీ బెదిరేదే లేదనుకుంటున్నారు. సీన్ కట్ చేస్తే ఇదీ లోకల్ బాయ్ నాని పరిస్థితి. బెట్టింగ్ ప్రమోషన్స్ చేస్తూ అరెస్టై రిమాండ్ లో ఉన్నాడు. చిన్న గేమ్ ఆడండి.. చిటికెలో సంపాదించండి. బెట్టింగ్ ఆడేందుకు మేమే మొదట డబ్బులు వేస్తాం. డోంట్ వర్రీ.. ఆడండి సంపాదించండి. ఇవీ ఏ సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఓపెన్ చేసినా ఫాలోవర్లు ఎక్కువగా ఉన్న వారు చేస్తున్న పని. ఈజీ మనీకి అలవాటు పడి.. జనాలందరినీ ఈ రొంపిలోకి దింపే ప్రయత్నాలు ఇటీవల పెరిగిపోయాయి. యూట్యూబ్, ఇన్ స్టా, ఈః, గూగుల్ నుంచి వచ్చే డబ్బులతో సంతృప్తి పడకుండా.. జనాలను ఆన్ లైన్ బెట్టింగ్ లకు, గేమింగ్ లకు, గ్యాంబ్లింగ్ లకు, డేటింగ్ లకు అలవాటు చేస్తున్నారు. తాజాగా లోకల్ బాయ్ నాని అరెస్ట్ తో సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ల ఆటలు ఇక సాగబోవని రుజువైంది. రండి వచ్చి ఆడండి.. అంటూ తలా కొంత మొత్తం ముందే ఇచ్చి ఇష్టంలేని వారిని కూడా ఈ కూపంలోకి లాక్కురావడం వేరు. రెండింటికీ చాలా తేడా ఉంది. బలవంతంగా ఈ ఆన్ లైన్ బెట్టింగ్ లోకి దింపే బ్యాచులు ఎక్కువవుతున్నాయి. సోషల్ మీడియాలో ఏది చూసినా అయితే బెట్టింగ్.. లేదంటే డేటింగ్ యాప్స్ ప్రమోషన్ చేసే వాళ్లే ఎక్కువగా కనిపిస్తున్నారు. లోకల్ బాయ్ నాని విశాఖకు చెందిన యూట్యూబర్. చేపలు పట్టడం వృత్తి. అవే సముద్రం వీడియోలు తీస్తూ జనంలో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు. కానీ ఈ మధ్య బెట్టింగ్ ప్రమోషన్స్ షురూ చేయడంతో అది సజ్జనార్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆ వీడియోను ట్యాగ్ చేస్తూ మీరు డబ్బు సంపాదించుకోవాలంటే అనేక మార్గాలు ఉన్నాయని, ఇవేం దిక్కుమాలిన పనులు అంటూ పోస్ట్ పెట్టారు. ఇప్పటికైనా సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లను ఆపండి అంటూ ట్వీట్ చేశారు సజ్జనార్. ఈ పోస్ట్ వైరల్ కావడంతో యూట్యూబర్ లోకల్ బాయ్ నాని రియాక్ట్ అయ్యాడు. కానీ అప్పటికే సమయం మించిపోయింది. ఇకపై బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్లు చేయనని, ప్రమోట్ చేస్తే సోషల్ మీడియా నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని చెప్పాడు నాని. ఈయనలో మార్పు వచ్చినందుకు సజ్జనార్ ప్రశంసించారు కూడా. సోషల్ మీడియా ముసుగులో ఏది చేసినా చెల్లుతుందని చాలా మంది అనుకుంటున్నారు. లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉన్న వారి సంగతి చెప్పక్కర్లేదు. యూట్యూబ్, గూగుల్, పెయిడ్ ప్రమోషన్స్, అఫిలియేట్ మార్కెటింగ్ ఇలా రకరకాల రూపాల్లో సోషల్ మీడియా నుంచి డబ్బులు వస్తున్నా.. చాలా మంది సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలు ఇంకా అత్యాశకు పోతున్నారు. ఎక్కువ కమీషన్లు వచ్చే పనులు చేస్తున్నారు. ఏపీ తెలంగాణలో ఆన్ లైన్ బెట్టింగ్స్, గేమింగ్స్ బ్యాన్ ఉన్నా సరే.. నిస్సిగ్గుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. రండి ఆడండి గెలుచుకోండి అంటున్నారు. తీరా చూస్తే మొదట్లో బాగానే డబ్బులు వస్తుంటాయి. రైట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్ల విషయానికి వద్దాం. కొందరు ట్రావెలింగ్ చేస్తూ లశ్రీనీణబ పెడుతున్నారు. ఇంకొందరు తాము చేసే పనులనే వీడియోలుగా తీసి పెడుతున్నారు. ఒక్కొక్కరికి ఒక్కో ట్యాలెంట్ ఉంది. అయితే ఇందులో కొందరు చాలా తెలివి మీరుతున్నారు. ఈ డబ్బులు సరిపోవడం లేదని ఎక్కువ కమీషన్లు ఇచ్చే ఆన్ లైన్ బెట్టింగ్, గేమింగ్స్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారు. షార్ట్ ఫిల్మ్స్ పెడుతున్న వారైతే డేటింగ్ యాప్ లను పరిచయం చేస్తున్నారు. ఫుల్ సెక్యూరిటీ అంటున్నారు. కుటుంబాలను నాశనం చేసేందుకు ఇదే సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు ప్రత్యక్షంగానే కారణమవుతున్నారు. జనాల చావులకు కారణమవుతున్నారు. ఎవరు చస్తే మాకేంటి అనుకున్న ధోరణితోనే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చింది. ఇకపై ఆటలు సాగబోవంటూ పోలీస్ డిపార్ట్ మెంట్ స్ట్రాంగ్ గానే వార్నింగ్ ఇస్తోంది. అంతే కాదు.. బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేయొద్దంటూ మరికొందరు సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లు ఎంత ప్రయత్నించినా వర్కవుట్ కావడం లేదు. ప్రభుత్వాలు ఒకవైపు ఆన్ లైన్ బెట్టింగ్ లను కట్టి చేస్తుంటే.. ఇంకోవైపు ఈ సోషల్ కేటుగాళ్లు రెచ్చిపోతూ ప్రమోట్ చేస్తూ అందరినీ అందులోకి లాగుతున్నారు. ఈః, ఇన్ స్టాగ్రామ్, యూట్యూబ్ ఇలా ఏది ఓపెన్ చేసినా ఇవే పనికిమాలిన ప్రమోషన్లు కనిపిస్తున్నాయి. ఇక చూస్తూ ఊరుకోబోమని పోలీసులు డైరెక్ట్ గానే వార్నింగ్స్ ఇస్తున్నారు. ఇది వరకు ఇలా బెట్టింగ్స్ ప్రమోట్ చేసిన వారి వీడియోలు, వారి వివరాలు సేకరిస్తున్నారు. తాము లక్షలకు లక్షలు సంపాదించామని ఫేక్ వీడియో తీసి పెడుతుంటారు. సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లను సోషల్ మీడియా వరకే ఆపేయాలి. .ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్, పలు గేమింగ్ కంపెనీల సీఈఓలు, ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు, టెలికాం సర్వీసు ప్రొవైడర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం ప్రతినిధులతో ఇటీవలే మీటింగ్ కూడా పెట్టి స్ట్రిక్ట్ గా చెప్పేశారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు బానిసలై పలువురు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. గేమింగ్ సంస్థలు జియో ఫెన్సింగ్ పాటించకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. నిషేధిత గేమింగ్ యాప్‌ల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పిలుపునిచ్చింది.

## పాక్ చెత్త ప్రదర్శన.. ఆయనే కారణం: పిసిబి మాజీ ఛైర్మన్



కరాచీ: ఈ ఏడాది ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్.. ఆటలో మాత్రం చెత్త ప్రదర్శన చేస్తోంది. ఆడిన రెండు మ్యాచుల్లో ఓటమిపాలైన జట్టు సెమీస్ ఆశలను దూరం చేసుకుంది. దీంతో పాకిస్థాన్ ఆటతీరుపై సర్వత్ర విమర్శల వర్షం కురుస్తోంది. ఇప్పటికే పలువురు మాజీలు జట్టుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాజీ ఛైర్మన్ నజామ్ సేథి జట్టుపై విమర్శలు చేశారు. పాక్ జట్టు ఇలా కావడానికి ఆ దేశ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ కారణమని అయన మండిపడ్డారు. 'పాకిస్థాన్ జట్టు ఒకప్పుడు ప్రపంచంలో నెంబర్. 1గా ఉండేది. 2019 నుంచి పాకిస్థాన్ క్రికెట్ పతనం మొదలైంది. అప్పటి ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలే ఇందకు కారణం. దేశవాళీ క్రికెట్‌ను నాశనం చేశారు. కోచ్‌ల ఎంపిక, ఇష్టమైన వారిని సెలెక్టర్లుగా చేయడం, ఇలా చాలా రాజకీయాలు జరిగాయి. జట్టులో సభ్యులు గ్రూప్‌లుగా ఏర్పడటం.. సభ్యులతో కెప్టెన్‌కి పడకపోవటం వంటి అంశాలు ఈ దారుణానికి కారణం' అని సేథి అన్నారు.

## సిరిసిల్ల చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి: ఎమ్మెల్సీ కవిత

వేములవాడ: ప్రముఖ శైవ క్షేత్రమైన వేములవాడలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో మొదలైన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన అభివృద్ధి కొనసాగాలని అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణకు కొంగుబంగారం లాంటి రాజరాజేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. వేములవాడ అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం కేసీఆర్ రూ.250 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి



ఆగవద్దని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో గుడి చెరువు వద్ద 30 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆలయానికి అందించిందని, ప్రస్తుతం అక్కడ అభివృద్ధి జరగడం లేదని స్థానికులు చెబుతున్నారని, కాబట్టి అక్కడ అభివృద్ధి పనులను కొనసాగించి త్వరగా పూర్తిచేయాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అంటేనే చేనేత జిల్లాగా పేరు పొందిందని, చేనేత కార్మికుల కోసం నాడు మంత్రిగా కేటీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం లేదని, తద్వారా సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, అన్ని నియోజకవర్గాలను ప్రభుత్వం సమానంగా చూడాలని సూచన చేశారు. సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ వేధింపులు ఎక్కువయ్యాయని, కేటీఆర్ ఫోటో పెట్టుకున్నందుకు టీ స్టాల్‌ను తీసేయించిన దుర్మార్గపు ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఇంత భేదభావం అక్కరలేదని, తక్షణమే ఇట్లాంటి కక్షపూరిత వ్యవహారాలను విరమించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

## నితీశ్ అనూహ్య నిర్ణయం- ఎన్డీఏలో కీలక మలుపు..!!

బీహార్ కేంద్రంగా రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. బీహార్ లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తాజాగా కేంద్ర బడ్జెట్ లోనూ మోదీ ప్రభుత్వం బీహార్ కు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. భారీ వరాలు ప్రకటించింది. వచ్చే ఎన్నికలకు నితీశ్ ను ఎన్డీఏ సీఎంగా ప్రకటించాలనే డిమాండ్ తెర మీదకు వచ్చింది. ఈ సమయంలోనే నితీశ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ నిర్ణయం ఆసక్తి కరంగా మారుతోంది. మంత్రివర్గ విస్తరణ ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ తన మంత్రివర్గ విస్తరణకు సిద్దం అయ్యారు. ఈ సాయంత్రం తన మంత్రివర్గాన్ని విస్తరించాలని నిర్ణయించారు. కొత్తగా నలుగురు బీజేపీ.. ఇద్దరు జేడీయూ ఎమ్మెల్యేలకు మంత్రులుగా అవకాశం దక్కనుంది. తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కడంతో రెవెన్యూ మంత్రి దిలీప్ జైస్వాల్ తన పదవికి రాజీనామా చేసారు. దీంతో, ఇప్పుడు ఖాళీగా ఉన్న మంత్రుల స్థానాలను భర్తీ చేయాలని నితీశ్ నిర్ణయించారు. దిలీప్ రాజీనా మాతో ఒక బెర్తు ఖాళీ అవుతుండగా.. కొత్తగా మరో ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకోబోతున్నారు. నితీశ్ కోసం డిమాండ్ దీని ద్వారా కొత్తగా అయిదుగురు మంత్రులు నితీశ్ కేబినెట్ లోకి రానున్నారు. బీజేపీ నుంచి మం త్రులుగా తార్కిషోర్ ప్రసాద్, సంజయ్ సరోగి, రాజు యాదవ్ మరియు అవధేష్ పటేల్ ఉన్నారు, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కొత్త జెడి(యు) నుంచి అయిదుగురు పేర్లు ప్రధానంగా రేసులో ఉన్నాయి. ప్రస్తుతం నితీశ్ మంత్రివర్గంలో 15 మంది బీజేపీ, 13 మంది జేడీ(యూ), హెచ్ఎఎం నుంచి ఇకరు, మరో స్వతంత్ర అభ్యర్థి కొనసాగుతున్నారు. ఖాళీగా ఉన్న ఆరు స్థానాలను నేడు భర్తీ చేసే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం నుంచి బీహార్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత మంత్రులు ఒకటి కంటే ఎక్కువ పోర్టు పోలియోలు నిర్వహిస్తున్నారు. ఇక, నితీశ్ కుమారుడు తాజాగా ఎన్డీఏ సీఎం అభ్యర్థిగా నితీశ్ పేరు ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఖనీలివతీవట ఃఎ బీజేపీ అంగీకరించేనా నితీశ్ కుమారుడు నిశాంత్ ఎన్నికలకు ముందే ఈ ప్రకటన చేయాలని కోరారు. దీని ద్వారా తిరిగి



కూటమి అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేసారు. నిశాంత్ కొంత కాలంగా రాజకీయ వ్యవహారాల్లో యాక్టివ్ గా ఉంటున్నారు. 2020లో బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జెడి-యు 43 సీట్లు గెలుచుకోగా, బిజెపి 73 సీట్లు గెలుచుకుంది. ఆర్జెడి 75 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. నితీష్ కుమార్ ఎన్డీఏ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, నితీష్ ఆర్జేడి.. కాంగ్రెస్‌తో చేతులు కలిపి మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారు. కాగా.. గత ఏడాది జనవరిలో, నితీష్ కుమార్ మళ్ళీ పార్టీ మారి, రికార్డు స్థాయిలో తొమ్మిదవసారి బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇక.. ఇప్పుడు బీహార్ లో చోటు చేసుకునే రాజకీయ పరిణామాల పైన ఎన్డీఏ పార్టీల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.

## తమిళనాడు సీఎం స్టాలిన్‌కు కేటీఆర్ మద్దతు.. డీలిమిటేషన్‌పై కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారత దేశానికి అన్యాయం జరుగుతుందన్న వ్యాఖ్యలకు మద్దతిచ్చారు. దేశానికి అత్యవసరమైనప్పుడు కుటుంబ్ర నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం తగదని అన్నారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను పరిగణనలోకి తీసుకోకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయడం ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిజంగానే నియోజకవర్గాల పునర్విభన చేయాలని భావిస్తే.. అది దేశానికి అందించే ఆర్థిక సహకారం వాటా ఆధారంగా ఉండాలని ప్రతిపాదించారు. దేశ నిర్మాణానికి తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కృషిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.8 శాతం మాత్రమే ఉందని.. కానీ దేశ జీడీపీలో మాత్రం 5.2 శాతం కంటే ఎక్కువ వాటా అందిస్తోందని పేర్కొన్నారు.

## ఆప్ కొత్త వ్యూహం.. పార్లమెంట్‌కి కేజ్రీవాల్..?



న్యూఢిల్లీ: గత ఏడాది జరిగి ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సిఎం కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పలువురు సీనియర్లు నేతలు ఓటమి పాలయ్యారు. అయితే ఈ ఫలితాల తర్వాత కేజ్రివాల్ సైలెంట్ అయిపోతారని అంతా భావించారు. కానీ, ఆయన పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇక ఆప్ ప్రతిపక్ష నేతగా మాజీ సిఎం అతిశీని ఎంపిక చేయడాన్ని కూడా ఆయన సమర్థించారు. అయితే ఇప్పుడు ఆయన మరో కీలక పదవి చేపట్టనున్నారని వార్తలు వస్తున్నాయి. పంజాబ్ లూథియానా వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే గురుప్రీత్ గోగి గత నెలలో మృతి చెందారు. దీంతో రాజ్యసభ ఎంపి సంజీవ్ అరోరాను ఆ ఉప ఎన్నిక ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆప్ ప్రకటించి అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. సంజీవ్ అరోరా రాజ్యసభ పదవీకాలం 2028తో ముగియనుంది. దీంతో ఆయన్ని అసెంబ్లీకి పంపించి కేజ్రీవాల్‌ను రాజ్యసభకు పంపించాలని ఆప్ వ్యూహం రచిస్తున్నట్లు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. మరి దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

## రాజన్న ఆలయంలో భక్తుల ఇక్కట్లు.. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో అధికారుల విఫలం

వేములవాడ టౌన్: మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. రాజన్నకు కోడెలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకోవడానికి బుధవారం వేకువజామునే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో భక్తులకు తిప్పలు తప్పలేదు. రద్దీకి అనుగునంగా సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. ప్రదర్శనం కల్పిస్తామని అధికారులు చెప్పడంతో గంటల తరబడి భక్తులు లైన్లలో నిలబడాల్సి వచ్చింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అర్ధరాత్రి స్థానికులు, మీడియాకు, ప్రజాప్రతినిధులకు ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్శనంలోనూ ఇబ్బందులు పడక తప్పలేదు. ప్రధాన ఆలయంలో గంటల క్యూలో నిలబడి భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అర్ధరాత్రి నుంచే క్యూలో 6 గంటలపాటు వేచి ఉన్నప్పటికీ దర్శనం కాలేదని, ప్రధాన ఆలయంలోకి అనుమతించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న దర్శనం కాకుండానే శిఖర దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. రాజన్న ఆలయ సిబ్బంది, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం భక్తులకు ఇబ్బంది కలిగించింది. క్యూలైన్లలో భక్తులను క్రమసంఖ్యలో పంపించాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో, బారీ కేడ్ల పైనుంచి దూకి ఒకరినొకరు చూసుకుంటూ గొడవపడడం కనిపించింది. వీఐపీలు, అధికారులు తమ బంధు సేవలోనే తరించి తరించిపోతున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఆ రెండు పథకాలకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ, ఫిబ్రవరి 26 ఏపీ ప్రజలకు మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్ చెప్పారు. ఏకంగా రెండు పథకాలను అమలు చేసే విషయంపై నారా లోకేష్ శాసనమండలిలో ప్రకటించడం విశేషం. ఎప్పుడెప్పుడా అంటూ ఏపీ ప్రజలు సూపర్ సిక్స్ పథకాల కోసం ఎదురుచూపులు చూస్తున్న సమయంలో, నారా లోకేష్ చేసిన ప్రకటన పెద్ద ఊరట నిచ్చిందని చెప్పవచ్చు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని, వైసీపీ విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో లోకేష్ ప్రకటనతో ఆ విమర్శలకు ఫుల్ స్టాప్ పడినట్లే.ఏపీలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే హామీని గుప్పించి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే దీపం పథకం 2.నీ మినహాయించి మరే పథకం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు సైతం ప్రభుత్వ ప్రకటనల కోసం ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి. అయితే ప్రభుత్వం ఏర్పడిన ఉంటేనే వరదలు రావడంతో, ప్రభుత్వ నష్టపోయిన రైతులను ఆదుకుంది. అంతేకాదు గ్రామీణ ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించి, గుంతలు లేని రాష్ట్రంగా గుర్తించబడేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది.ఓ దశలో సీఎం చంద్రబాబు సైతం గత ప్రభుత్వం చేసిన అరాచకంతో ప్రజలకు త్వరగా సూపర్ సిక్స్ పథకాలను అందించలేక పోతున్నామని నిట్టూర్చారు. అలాగే ఎట్టి పరిస్థితుల్లో తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ సైతం ఇచ్చారు. ఇటువంటి సమయంలో వైసీపీ, కాంగ్రెస్ పార్టీ లు సూపర్ సిక్స్ ఎక్కడ అంటూ సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వాన్ని ఇరకాటం పెట్టే ప్రయత్నాలకు పూనుకున్నాయి. అందుకే శాసనమండలిలో మంత్రి నారా లోకేష్ సూపర్ సిక్స్ పథకాలపై మంగళవారం కీలక ప్రకటన చేశారు.తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు అందించనున్నట్లు, అలాగే రైతన్నలకు అండగా నిలిచేందుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఏడాదికి రూ. 20 వేలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైందంటూ లోకేష్ ప్రకటించారు. ఈ రెండు పథకాలను ఏప్రిల్, మే నెలలో ప్రారంభిస్తామని, అర్హత గల ప్రతి లబ్ధిదారునికి ప్రయోజనం చేకూరుస్తామన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ప్రజలకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని లోకేష్ అన్నారు.గత ప్రభుత్వం పింఛన్ నగదు పెంపుపై దోబూచులాడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట మేరకు పింఛన్ నగదును పెంచిందని లోకేష్ శాసనమండలిలో తెలిపారు. మొత్తం మీద ఏప్రిల్, మే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు రాష్ట్రంలో అమలు కానున్నట్లు లోకేష్ ప్రకటనతో క్లారిటీ వచ్చింది. సూపర్ సిక్స్ లో ఈ పథకాలు అమలైతే, మూడు పథకాలు అమలులోకి వచ్చినట్లుగా భావించవచ్చు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో తల్లికి వందనం ప్రారంభం కానుండగా, ఆ సమయంలో పథకం అమలు కావడమే మంచిదిగా ప్రజలు భావిస్తున్నారు. అలాగే అన్నదాత సుఖీభవ స్కీమ్ కూడా ప్రారంభం కానున్నట్లు లోకేష్ చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 15 వేల మంది ఉద్యోగుల సర్దుబాటు షురూ...

నెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రరేఖ ప్రతినిధి), ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల్లో అదనపు సిబ్బంది లెక్క తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో 15,498 మంది సిబ్బంది అదనంగా ఉన్నట్టు గుర్తించారు. సచివాలయాల్లో జనాభా ప్రాతిపదికన ఎంత మంది పనిచేయాలో ఇప్పటికే ఖరారు చేవారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో అదనంగా ఉన్న సిబ్బందిని గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో 12,126 మంది అదనంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాల్లో 3,372 మంది ఉన్నారు.సచివాలయ సిబ్బందిని వారి ఆసక్తి మేరకు విధులు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. మిగిలిన సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేస్తారు. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భావిస్తోంది. మరోవైపు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయడంపై ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయడంతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమన్వయంచేసి వాటిని పరిష్కరించేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తారు.ప్రస్తుతం గ్రామ సచివాలయాల్లో అదనంగా పనిచేస్తున్న ఉద్యోగుల్లో డిజిటల్ అసిస్టెంట్లు 173, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 414, గ్రామ మహిళా పోలీసులు 2107మంది, వీఆర్వోలు 2899, గ్రామ సర్వేయర్ అసిస్టెంట్లు గ్రేడ్ 3- 4,722, అగ్రికల్చర్ హార్టి కల్చర్, సెరి కల్చర్ అసిస్టెంట్లు 1154, ఎనర్జీ అసిస్టెంట్లు 405, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లు 252 మంది ఉన్నారు.పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాల్లో వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులు 37, మహిళా పోలీసులు 913, వార్డు రెవిన్యూ కార్యదర్శులు 1006, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు 1336, వార్డు, ఎనర్జీ కార్యదర్శులు 80 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే కొందరిని పట్టణ ప్రణాళిక శాఖకు తరలించారు.గ్రామ, వార్డు సచివాలయాలను మూడు క్యాటగిరీలుగా విభజించారు. 2500లోపు జనాభా ఉన్న సచివాలయాలను ఏ క్యాటగిరీలో, 2501 నుంచి 3500 లోపు జనాభాను బీ క్యాటగిరీగా, 3501పైగా జనాభా ఉన్న వాటిని సీ క్యాటగిరీలో చేర్చారు. 2500లోపు జనాభా ఉంటే ఆరుగురు ఉద్యోగుల పనిచేయాల్సి ఉంటుంది.రాష్ట్ర వ్యాప్తంగా 3015 గ్రామ సచివాయాలు, 547 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 3562 సచివాలయాల్లో 2500లోపు జనాభా ఉంది.2501 నుంచి 3500 జనాభా ఉన్న సచివా?లయాలకు ఏడుగురు సిబ్బందిని కేటాయిస్తారు. ఈ విభాగంలో 3,884 గ్రామ సచివాలయాలు, 1504 వార్డు సచివాలయాలతో కలిపి మొత్తం 5,388 ఉన్నాయి.

# జీవీరెడ్డి బాటలో మరింత మంది...?



విజయవాడ, ఫిబ్రవరి 26, టీడీపీ అధిష్టానంపై కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారా? ధిక్కార స్వరం వినిపించే సమయం కోసం ఎదురు చూపుల్లో ఉన్నారా? ఆ ప్రభావమే జీవీ రెడ్డి రాజీనామాతో బహిర్గతమైందా? వైసీపీ దారిలో టీడీపీ వెళ్తుందని కార్యకర్తల కామెంట్స్ వెనుక అసలు కారణం ఏమిటి? పాలన తప్ప కార్యకర్తలను పట్టించుకోవడం లేదన్న విమర్శలలో వాస్తవమెంతఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ గా జీవీ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. టీడీపీ అధికారంలో లేని సమయంలో వైసీపీ తన విమర్శలతో ముచ్చెమటలు పట్టించిన వారిలో జీవీ రెడ్డి ఒకరు. జీవీరెడ్డి లైన్ దాటకుండా విమర్శలు గుప్పిస్తారని, అదే ఆయనకు పార్టీలో సుస్థిర స్థానం కల్పించిందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అందుకే సీఎం చంద్రబాబు కూడా జీవీరెడ్డికి ప్రాధాన్యత కల్పిస్తూ, ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ గా నియమింపజేశారు. అలా భాధ్యతలు స్వీకరించారో లేదో ఛైర్మన్ స్థాయిలో ఆయన పూర్తి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఈ దశలో ఎండీగా ఉన్న దినేష్ ఐఏఎస్ కు జీవీ రెడ్డికి విభేధాలు వచ్చాయని టాక్. అందుకే నిరంతరం ఏపీ ఫైబర్ నెట్ వార్తల్లో నిలుస్తూ వచ్చింది.ఆ విభేధాల కారణంగానే జీవీ రెడ్డి రాజీనామా చేశారన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. కానీ ఇక్కడ అందరికీ వస్తున్న ఏకైక డౌట్ ఒక్కటేనట. ఏపీ ఫైబర్ నెట్ లో వివాదం ఉంటే, చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి. కానీ ఏకంగా టీడీపీ సభ్యత్వానికి కూడా జీవీ రాజీనామా చేయడమే సంచలనంగా మారింది. ఇదే టీడీపీకి పెద్ద మైనస్ అయిందని విశ్లేషకుల అభిప్రాయం. జీవీ రాజీనామా చేసిన వెంటనే వైసీపీ పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుందని అందరూ భావించారు. కానీ ఇక్కడ అంతా వ్యతిరేకంగా సాగింది. టీడీపీకి కరడుగట్టిన సైనికులు సోషల్ మీడియాలో మంచి పని చేశారు జీవీ రెడ్డి అన్నా అంటూ మారుమ్రోగించారు. అంతేకాదు టీడీపీకి వైసీపీ గతేనంటూ సీరియస్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ కామెంట్స్ వెనుక పెద్ద కారణమే ఉందట.రెడ్డి లాంటి నిజాయితీ పరుడైన నాయకుడికి పార్టీ అండగా ఉండలేదన్నది కార్యకర్తల మనోగతం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు తీరున జీవీ రాజీనామాతో అధిష్టానం అలర్ట్ అయినా అప్పటికే జరిగే నష్టం జరిగిందని కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. ఎండీ దినేష్ ను బదిలీ చేసినప్పటికీ, ఇదే పని ముందే చేసి ఉంటే జీవీ రాజీనామా ఉండదని కామెంట్స్ వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక టీడీపీ అధిష్టానం కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, వైసీపీ దారిలో నడుస్తుందని పలువురు తెలుగు తమ్ముళ్లు బాహాటంగానే విమర్శిస్తున్నారుపార్టీ క్యాడర్ పట్టించుకోకనే వైసీపీకి 11 సీట్లు దక్కాయున్న విషయాన్ని జగన్ ఆలస్యంగా గుర్తించారని, అధికారంలో ఉన్న టీడీపీ మాత్రం నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని లేకుంటే పెను ప్రమాదమే పొంచి ఉందన్న టాక్ నడుస్తోంది. పాలన ఒక్కటే కాదు, పార్టీని కాపాడుకోవాలని టీడీపీ అధిష్టానానికి క్యాడర్ సూచిస్తోంది. జీవీ రాజీనామా పెద్ద మైనస్ గా పేర్కొంటున్న తెలుగు తమ్ముళ్లు, ఇప్పటికైనా అధిష్టానంపై సోషల్ మీడియా వేదికగా ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. మరి క్యాడర్ ను నచ్చజెప్పుకొనే ప్రయత్నాలు టీడీపీ అధి ష్టానం చేస్తుందా? లేక సైలెంట్ గా జరిగే పరిణామాలను చూస్తూ ఉంటుందా తెలియాల్సి ఉంది.

# భారీ డిమాండ్లతో భార్యా బాధితుల సంఘం

**15 ఏళ్ల కిందట పురుడు**

విజయవాడ, ఫిబ్రవరి 26, సమాజంలో ఇటీవల భార్యాబాధితుల సమస్యలపై చర్చ జరుగుతోంది. భార్యలకు ఏ సమస్యల వచ్చినా.. వారి తరపున నిలబడేందుకు మహిళా సంఘాలు ఉన్నాయి. భర్తలకు వచ్చిన సమస్యలను తీర్చేందుకు ఏ సంఘం ముందుకు రాదు. ఈ నేపథ్యంలోనే భార్యాబాధితుల సంఘం ఏర్పడింది.దేశంలోని మొదటి సారిగా భార్యాబాధితుల సంఘం 2010లో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో పురుడు పోసుకుంది. అనంతరం దేశవ్యాప్తంగా విస్తరించింది. తాడేపల్లిగూడెం, నందిగామ, హైదరాబాద్, ఖమ్మంలో బలమైన కమిటీలతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 2010లో 35 మందితో భార్యా బాధితుల సంఘం ఏర్పడింది. ఈ సంఘంలో ప్రస్తుతం సుమారు 10 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. 25 మంది క్రియాశీలకంగా కోర్ కమిటీగా ఏర్పడి సంఘం తరపున న్యాయం కోసం గళం విప్పుతున్నారు. అమెరికా , మలేషియా, దుబాయ్‌ల నుంచి కూడా భార్యా బాధితులు ఫోన్‌లో సంప్రదిస్తున్నారని.. జాతీయ అధ్యక్షుడు జి.బాలాజీ రెడ్డి తెలిపారు. భార్యా బాధితుల రక్షణ కోసం చట్టాలు రావాల్సిందేనని అంటున్నారు. గౌరవం కోల్పోతున్నామని, మనశ్శాంతి ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందరో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, తప్పు లేకుండా పరిహారాలు కోరవద్దని అన్నారు. తమ ఆస్తులకు తమను దూరం చేస్తున్నారని, భార్యలతో ఇబ్బంది పడే భర్తల తరపున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.13 డిమాండ్లు..1. భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు.. భర్తలు, భర్తల కుటుంబాలందరికీ కూడా కౌన్సెలింగ్‌లు ఇచ్చి సరైన న్యాయం జరిగేలా చూడాలి.2.భార్యలు ఎన్ని రకాల కేసులు పెడితే అన్ని రకాల కేసులకు హాజరుకావాలి. అలా రెండుసార్లు హాజరుకాని పక్షంలో ఆ కేసులను పూర్తిగా రద్దు చేయాలి.3.498 (ఏ) గృహ హింస కేసు పెట్టిన ఏడాది తరువాత కేసు తేలినా, తేలకపోయినా కోర్టు విడాకులు మాంజూరు చేసి.. రెండో వివాహానికి అనుమతి ఇవ్వాలి.4.498 (ఏ) గృహ హింస తప్పుడు కేసు అని తేలితే.. భార్య, భార్య తల్లిదండ్రులకు మూడేళ్ల జైలు శిక్ష, భర్తలకు నష్టపరిహారం, పరువు మర్యాదలు ఇప్పించాలి.5.ఎంసీ, డీవీసీ (డొమెస్టిక్ వైలెన్స్)లను చట్టం నుంచి పూర్తిగా రద్దు చేసి.. పెండింగ్‌లో ఉన్న కేసులను రద్దు చేయాలి. జైలు శిక్షలు అనుభవిస్తున్న వారిని వెంటనే విడుదల చేయాలి. 6. పూర్వం ఈ కేసుల వల్ల నష్టపోయిన వారికి భార్యలతో ఆ నష్టపరిహారాన్ని ఇప్పించాలి. ఏడాది పాటు భార్యలకు, భార్యల తల్లిదండ్రులకు జైలు శిక్ష విధించాలి.7. గృహ హింస కేసు పెట్టిన తరువాత.. భార్యా భర్తలిద్దరి శాంపిల్స్ డీఎన్ఏ టెస్ట్‌లకు పంపాలి.8. భార్యలు కేసులు పెట్టిన తరువాత ఒక వేళ పిల్లలు ఉంటే.. భార్యల వద్ద నాలుగు రోజులు, భర్తల వద్ద మూడు రోజులు ఉండేటట్లు అనుమతి ఇవ్వాలి.

# కుంకీ ఏనుగులు ఎప్పుడొస్తాయి...

తిరుపతి, ఫిబ్రవరి 26, ఏపీలో ఏనుగుల దాడుల్ని నివారించేందుకు కర్ణాటక నుంచి శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల్ని తెచ్చేందుకు ఆ రాష్ట్రంతో ఒప్పందం చేసుకుని ఐదు నెలలు దాటింది. గత ఏడాది ఆగస్టు 8న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా బెంగుళూరు వెళ్లి కుంకీ ఏనుగుల కోసం సీఎం సిద్ధరామయ్యను అభ్యర్థించారు.ఆ తర్వాత కర్ణాటక అటవీ శాఖతో గత ఏడాది సెప్టెంబర్ 27న కుంకీ ఏనుగుల కోసం విజయవాడలో ఒప్పందం చేసుకున్నారు. కర్ణాటకలో శిక్షణ పొందిన ఏనుగులతో ఏపీకి చెందిన అటవీ సిబ్బంది శిక్షణ కూడా ఇప్పిస్తున్నట్టు ప్రచారం జరిగింది. ఐదు నెలలు గడిచినా కుంకీ ఏనుగుల జాడ మాత్రం లేదు.కర్ణాటక నుంచి 8 కుంకీ ఏనుగులను ఆంధ్రప్రదేశ్ పంపేందుకు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య సెప్టెంబర్ 27న విజయవాడలో అవగాహన ఒప్పందం జరిగింది. దీంతో కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు వచ్చేస్తాయని అటవీ శాఖ చెప్పింది. దీంతో చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలతో తరచూ ఏనుగుల దాడులకు ముగింపు లభిస్తుందని భావించారు.కుంకీ ఏనుగుల కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవడంతో వీలైనంత త్వరగా ఏనుగులు ఏపీకీ వచ్చేస్తాయని భావించారు. అయితే అటవీ శాఖ నియమనిబంధనలు ఏనుగుల తరలింపుకు అడ్డంకిగా మారాయి. వన్య ప్రాణుల తరలింపు, వాటి సంరక్షణ విషయంలో ఉన్న నిబంధనలతో ఏపీకి కుంకీ ఏనుగుల తరలింపు ఆలస్యమైనట్టు తెలుస్తోందిఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, కడప జిల్లాలకు పొరుగు రాష్ట్రాలతో సరిహద్దులు ఉన్నాయి. చిత్తూరు జిల్లాకు తమిళనాడు, కర్ణాటక అటవీ ప్రాంతాల నుంచి వచ్చే ఏనుగులు తరచూ దాడులు చేస్తున్నాయి. ఇటు ఉత్తరాంధ్రలో ఒడిశా అటవీ ప్రాంతం నుంచి వచ్చే ఏనుగులు తరచూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి.అటవీ ప్రాంతాలకు దగ్గర్లో ఉన్న గ్రామాల్లోని పంట పొలాలు, ఊళ్లపై ఏనుగుల మందలు తరచుగా దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ప్రాణ నష్టం జరుగుతోంది. గ్రామస్తులు కొన్ని సార్లు ఏనుగులు అదలించి, శబ్దాలు చేసి తరిమి కొడుతున్నా తరచూ గాయపడటమో, ప్రాణ నష్టమో తప్పడం లేదు.ఏనుగులు గుంపు, గుంపులుగా దాడులు చేస్తే భారీ నష్టం వాటిల్లుతోంది. ఏనుగులు మందలుగా పంటల్ని సర్వనాశనం చేస్తున్నాయి. కనిపించిన మనుషుల్ని తొక్కి చంపేస్తున్నాయి. ఏపీలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తూ ఉన్నాయి.సాధారణంగా వీటిని ఎదుర్కోవడం, వాటిని అడవుల్లోకి తిప్పి పంపడం కష్టం. అదే శిక్షణ పొంన కుంకీలతో వాటిని కట్టడి చేయడం సులువుగా ఉంటుంది. వాటిలో సుశిక్షుతులైన మావటిలు జనావాసాల్లోకి వచ్చిన ఏనుగుల్ని వెనక్కి తరుముతారు.అడవుల్లో ఒంటరిగా తిరిగి మగ ఏనుగుల్ని బంధించి కుంకీ ఏనుగులుగా లొంగదీసుకుంటారు. ఏనుగుల మందల్ని అడవుల్లోకి తరమడంలో ఇవి సమర్థంగా వ్యవహరిస్తాయి. ఒక్కోసారి వాటితో తలపడతాయి. బలంగా, వయసులో ఉన్న ఏనుగుల్ని పోరాటాల కోసం తయారు చేస్తారు.ఆంధ్రప్రదేశ్‌లో శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల కొరత ఉంది. ప్రస్తుతం ఏపీలో జయంత్, వినాయక్ అనే రెండు కుంకీలు ఉన్నాయి. అయితే అవి వయసు పైబడ్డాయి. చిత్తూరు జిల్లా కౌండిన్య అడవుల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ననియాల సంరక్షణ కేంద్రంలో ఈ రెండు ఉన్నాయి. ప్రస్తుతం ఎక్కడకు పడితే అక్కడకు తరలించేందుకు అనువుగా లేవు.తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏనుగులు దాడి జరిగినా వీటినే తీసుకు వెళ్లేవారు. వృద్ధాప్యంలో ఉన్న ఏనుగులతో మందలపై యుద్ధాలకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో కర్ణాటకతో ఒప్పందం చేసుకున్నారు.కర్ణాటకతో చేసుకున్న ఒప్పందం మేరకు ఏపీకి 8 కుంకీ ఏనుగులు రావాల్సి ఉంది. అయితే సాంకేతిక కారణాలతో వీటి రాక ఆలస్యమైనట్టు అటవీ శాఖ చెబుతోంది. ప్రస్తుతం కర్ణాటక అటవీ శాఖ మంత్రి వద్ద కుంకీల బదలాయింపు ఫైల్ పెండింగ్‌లో ఉంది. అక్కడ నుంచి కర్ణాటక సీఎం అమోదం లభించాల్సి ఉంటుంది. తొలి విడతలో మార్చిలోగా నాలుగు కుంకీ ఏనుగులు ఏపీకి వస్తాయని చెబుతున్నారు.మరోవైపు కర్ణాటక నుంచి వచ్చే ఏనుగుల కోసం మావటిలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. కొత్త ఏనుగులను అదుపులో ఉంచేందుకు మావటిలను సిద్ధం చేస్తున్నారు. కుంకీల అవసరం, వాటి దాడుల నేపథ్యంలో ఏపీలోనే శాశ్వతంగా కుంకీల తయారీ చేపట్టాలని డిప్యూటీ సీఎం మంత్రి పవన్ భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా అటవీ శాఖ సన్నద్ధం అవుతోంది.

# మూడు, రెండు పద్ధతిలో ఎమ్మెల్సీ సీట్లు

కడప, ఫిబ్రవరి 26 , ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అప్పుడే సందడి మొదలైంది. ఎమ్మెల్సీ సీటు కోసం ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కేవలం ఐదు సీట్లు కావడంతో కూటమి పార్టీల మధ్య బలమైన పోటీ నెలకొంది. ఇందులో జనసేనకు ఒకటి ఖాయమైంది. కాకపోతే బీజేపీ కూడా మాకు ఇవ్వాలని పట్టుబడినట్టు వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే టీడీపీకి కేవలం మూడు మాత్రమే మిగలనున్నాయి.ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 3న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎమ్మెల్యే కోటాలో జరుగుతుండడంతో అవన్నీ ఏకగ్రీవంగా ఎన్నిక జరగనుంది. ముఖ్యంగా కూటమి పార్టీల నుంచి అభ్యర్థులంతా ఎన్నిక కానున్నారు. ఏపీలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు కూటమి నేతల మధ్య పోటీ నెలకొంది.పదవీకాలం ముగిసిన వారిలో జంగా కృష్ణమూర్తి , దువ్వారపు రామారావు, యనమల, అశోక్‌బాబు, తిరుమలనాయుడులకు మార్చి 29న ముగియనుంది. ఇందులో జంగా కృష్ణమూర్తి మినహా అంతా టీడీపీకి చెందినవారు. ఎన్నికలకు ముందు జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరారు. ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి బలమైన పోటీ ఉంది.జనసేన నుంచి నాగబాబు సీటు ఖాయం. ఆ తర్వాత ఆయన్ని కేబినెట్‌లోకి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదివరకే చెప్పారు. ఇకపోతే బీజేపీ వంతైంది. మిత్ర ధర్మ ప్రకారం ఒక సీటు కేటాయిస్తారని ఆ పార్టీ నేతలు అంచనాలు పెట్టుకున్నారు. ఒక్కసీటు కోసం గోదావరి జిల్లాల నుంచి సోము వీర్రాజు, ఉత్తరాంధ్ర నుంచి మాధవ్, రాయలసీమ నుంచి ఒకరు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. ఆ సీటును బీజేపీకి కేటాయిస్తే టీడీపీకి నాలుగు ఎమ్మెల్సీ సీట్లు దక్కే అవకాశముంది.ఇక టీడీపీ విషయానికి వద్దాం. ఒకవేళ బీజేపీకి గనుక ఒక్కసీటు కేటాయిస్తే టీడీపీకి మూడు మాత్రమే మిగలనున్నాయి. పిఠాపురం నుంచి వర్మ, బెడవాడ నుంచి వంగవీటి రాధ, దేవినేని ఉమామహేశ్వరరావు రేసులో ఉన్నారు. బీసీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మైనారిటీ కోటాలో విశాఖకు చెందిన ఎండీ నజీర్ పోటీపడుతున్నారు.వసంత కృష్ణ ప్రసాద్ కోసం మైలవరం సీటును దేవినేని త్యాగం చేశారు. దీంతో ఆయనకు సీటు ఇస్తారన్నది కొందరు నేతల మాట. ఇక వంగవీటి రాధ ఎప్పటినుంచో పార్టీలో కొనసాగుతున్నారు. ఈసారి రేసులో ఆయన ఉన్నట్లు బలంగా సంకేతాలు వస్తున్నాయి. గతంలో చాలా సార్లు ఎమ్మెల్సీ రేసులో ఆయన పేరు వినిపించింది.దీనికితోడు పదవీకాలం ముగియనున్న నేతల్లో జంగా కృష్ణమూర్తి , దువ్వారపు రామారావు, యనమల సైతం రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎలా ముందుకు వెళ్లాలని అనేదానిపై కొందరు నేతలతో అధినేత మంతనాలు జరిపినట్టు సమాచారం. వీరిలో కొందరికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చి పార్టీకి నమ్మినబంటుగా ఉన్నవారికి ఎమ్మెల్సీ సీట్లు ఇస్తారని అంటున్నారు. ఏదిఏమైనా బడ్జెట్ సమావేశాలు పూర్తి అయ్యేసరికి సీట్లపై ఓ కొలిక్కి రావచ్చని అంటున్నారు.

# తునిలో వైసీపీకి దెబ్బ

కాకినాడ, ఫిబ్రవరి 26 ( , తుని మున్సిపల్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక విషయంలో టీడీపీ, వైసీపీ మధ్య రాజుకున్న ఆధిపత్య పోరులో క్రమక్రమంగా వైసీపీ పట్టు తప్పుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా వైసీపీకి చెందిన అయిదుగురు కౌన్సిలర్లు రాజీనామా చేయడంతో వైసీపీ బలం 12 మందికి పడిపోగా టీడీపీ 16 మందితో ఛైర్మన్‌గిరి దక్కించుకోవడానికి సిద్ధ పడుతోంది. దీంతో ముందస్తుగానే తుని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి రాజీనామా చేశారు. మున్సిపాలిటీలో తమకు 18 మంది బలం ఉందని వైసీపీ చెబుతూ రాగా అప్పటికి 15మంది మాత్రమే హాజరు అవుతుండగా అందులో ముగ్గురు మున్సిపల్ సమావేశానికి గైర్హాజరు అయ్యారు. మరో ముగ్గరు టీడీపీ క్యాంప్‌లో చేరారు. దీంతో వైసీపీ బలం 12కు పడిపోయింది. అయితే తన పదవికి రాజీనామా చేసిన ఛైర్‌పర్సన్ సుధారాణి తాను సాధారణ కౌన్సిలర్‌గానే కొనసాగుతానని వెల్లడిరచినట్లు తెలుస్తోంది. తుని మున్సిపల్‌లో 30 మంది కౌన్సిలర్లుకు ప్రస్తుతం 28 మంది వరకు కౌన్సిలర్లు ఉండగా వీరిలో 18 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా మిగిలిన 10 మంది టీడీపీ కౌన్సిలర్లు.. ఇదిలా ఉంటే మున్సిపల్ వైస్ ఛైర్మన్ పదవికోసం టీడీపీ, వైసీపీ పోటీ పడుతున్నాయి. దీంతో ఇటీవల పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడిన తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాలుగోసారికూడా మళ్లీ వాయిదాపడింది. దీని వెనుక మాజీ మంత్రి దాడిశెట్టి రాజానే కారణమని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. పది మంది వరకు వైసీపీ కౌన్సిలర్లు వైసీపీను వీడి టీడీపీలో చేరారు. వీరిని మాజీ మంత్రి యనమల రామృకృష్ణుడు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఒక్కొక్కరూ పార్టీని వీడిపోవడంపై రాజీనామా చేయాలని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కౌన్సిలర్లుపై ఒత్తిడి తెచ్చారని, అయితే తాము రాజీనామా చేయమని తేల్చిచెప్పి టీడీపీలో చేరినట్లు వారు చెబుతున్నట్లు తెలుస్తోంది.

## టిటిడి వారు మహానందీశ్వరునికి పట్టువస్త్రాలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 26- తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈఓ మోహన్ రాజు దంపతులు బుధవారం నాడు మహానందీశ్వరునికి పట్టు వస్త్రాలను ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రదమ నందిలో ప్రత్యేక పూజలు చేసిన ఎన్ ఎమ్ డి ఫిరోజ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 26- మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రధమనంది దేవస్థానం నందు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు . అనంతరం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి గోపి. ప్రదాన అర్చకులు ప్రవీణ్. రాఘవేంద్ర శర్మ. టిడిపి నాయకులు కామిని మల్లిఖార్జున. గోవింద నాయుడు. మారుతి ప్రసాద్. వైయస్ ఆర్ నగర్ టిడిపిపార్టీ ఇన్ చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## వాసాపురంలో పార్వేట అర్చక బృందం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 26-. మహాశివరాత్రి సందర్భంగా అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పార్వేట అర్చక బృందం బుధవారం శ్రీ వాసాపుర వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ మదుసుదన్ రెడ్డి తెలిపారు. అర్చకులను ఆలయ కమిటీ శ్రీ వాసాపుర వేంకటేశ్వర స్వామి వారి స్మారక మెమెంటో ఇచ్చి వారిని సత్కరించడం జరిగిందని అన్నారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా సర్వం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సింగతల మధుసూదన్ రెడ్డి , వైస్ చైర్మన్ ఎల్.వి రంగనాయకులు , కోశాధికారి ఈ కె.వి నరసింహులు , ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ. మరియు కమిటీ సభ్యులు గంధం రఘునాథరెడ్డి ,గంధం సేనాపతి రెడ్డి ,సింగతలచెన్నకేశవరెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు



--మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 26-: మహాశివరాత్రిసందర్భంగా పట్టణంలోని శివాలయాల వద్ద పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. ఆయన పట్టణం లోని పలు ఆలయాలను పరిశీలించారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తారని రద్దీ ఏర్పడే అవకాశాలు ఉంటాయని, భక్తులకు అసౌకర్యం కలిగించొద్దని ఆయన అన్నారు.

# శ్రీశైలంలో మాత్రమే జరిగే పాగాలంకరణ సేవ..



మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శ్రీశైలం క్షేత్రంగా పాగాలంకరణను ప్రత్యేక ఉత్సవంలా జరిపిస్తారు. ఏ శైవక్షేత్రంలోనూ, శివాలయాల్లోనూ లేని విధంగా ఇక్కడ మాత్రమే ఈ సేవ జరుగుతుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లింగోద్భవ కాలంలో జరిపే ఈ పాగాలంకరణ సేవ చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలం క్షేత్రానికి తరలివచ్చారు. హరోం హరా.. హరోం హరా అంటూ భక్తుల నినాదాలతో శ్రీశైల క్షేత్రం మార్మోగుతోంది. ఇల కైలాసంగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో మాత్రమే జరిపే ఈ పాగాలంకరణ సేవ విశిష్టితను ఇప్పుడు తెలుసుకుందాం. **ఏటా రెండు సార్లు బ్రహోత్సవాలు :** రాజులు, రాజన్యులు, చక్రవర్తులు, సామాన్యులు సైతం శిరస్సువంచి నమస్కరించే దైవం మల్లికార్జునుడు. ఆ స్వామి మహాలింగ చక్రవర్తిగా భ్రమరాంబతో కూడి శ్రీగిరిని పాలిస్తున్నాడు. ఈ క్షేత్రంలో ప్రతి ఏడాది రెండుసార్లు బ్రహోత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. బ్రహ్మ జరిపించే ఉత్సవాలు కాబట్టి వీటికి బ్రహోత్సవాలు అని పేరు. ప్రతి ఏడాది సంక్రాంతికి ఒకసారి, శివరాత్రికి ఒకసారి ఈ బ్రహోత్సవాలు నిర్వహిస్తారు.

**మహాశివరాత్రి బ్రహోత్సవాలు :** ప్రసిద్ధ శైవ క్షేత్రమైన శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహోత్సవాల వైభవం చెప్పటానికి వీలు కానిది. నవాహ్నిక దీక్షతో పదకొండు రోజులపాటు ఈ ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతాయి. బ్రహోత్సవాలలో ప్రతిరోజు సాయంత్రం వేళ భృంగివాహనం, హంసవాహనం, మయూరవాహనం, రావణవాహనం, గజవాహనం, అశ్వవాహనాల మీద శ్రీస్వామిఅమ్మవార్లు తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఆయా ప్రముఖ దేవాలయాల నుంచి శ్రీస్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ కూడా జరగటం ఇక్కడి విశేషం. మహాశివరాత్రి నాడు లింగోద్భవ కాలంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది. **పాగాలంకరణ అంటే? :** అభిషేకం తరువాత శ్రీస్వామిఅమ్మవార్లకు కళ్యాణమహోత్సవం జరిపిస్తారు. మన సనాతన ధర్మ సంప్రదాయంలో కళ్యాణం ఒక మహాద్భుత ఘట్టం. దేవాలయాల్లో నిత్య కళ్యాణం చేస్తారు. కళ్యాణ సంప్రదాయంలో మొదట వరుడికి మంగళ స్నానాలు చేయిస్తారు. ఆ మంగళ స్నానమే స్వామివారికి చేసే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం. స్నానం తరువాత స్వామిని వారిని (వరుడిని) పెండ్లి కొడుకుగా అలంకరించుటలో భాగంగా తలకు పాగా చుట్టడం సంప్రదాయం. ఆ తలపాగా ఎలాగైతే వరుడికి చుడతామో అలాగే స్వామివారి ఆలయ విమాన శిఖరంపై ఉన్న త్రిశూలానికి పాగాను కట్టి ఆలయంపై ఉన్న నందుల కొమ్ములకు పాగాను చుడతారు. ఈ అలంకరణనే పాగాలంకరణ అని పిలుస్తారు. శ్రీశైలంలో పాగాలంకరణ సుమారు వంద సంవత్సరాలకు పై నుంచి జరుగుతుందని స్థానికుల సమాచారం. ఈ క్షేత్రంలో తప్ప ప్రపంచంలోని ఏ శైవ క్షేత్రంలోను ఇలాంటి ఆచారం లేదన్నది అక్షర సత్యం. పాగాలంకరణ జరిగే సమయంలో క్షేత్రం అంతటా విద్యుత్తు నిలిపివేస్తారు. చిమ్మ చీకటిలో పృథ్వీ వేంకటేశ్వర్ల వారి కుటుంబంలోని ఒక వ్యక్తి దిగంబరంగా ఈ పాగాలంకరణ చేయటం విశేషం. పాగాలంకరణ జరుగుతున్నంత సేపు ఆలయంలో శివనామ స్మరణ, పాగాలంకరణ విశేష వ్యాఖ్యానం జరుగుతుంటాయి. వేలాది మంది భక్తులు ఆలయంలో ఈ ప్రక్రియను భక్తితో వీక్షించడానికి వస్తారు. పాగాలంకరణ పూర్తి అయ్యాక బ్రహోత్సవ కల్యాణం జరిపిస్తారు. ముక్తికి సోపానం శ్రీశైల దర్శనం: పరమేశ్వరుడు మల్లికార్జునుడిగా, పార్వతీదేవి భ్రమరాంబికగా కొలువైన శ్రీశైల క్షేత్రాన్ని దర్శించడం వల్ల మోక్షం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్షేత్రానికి పర్వదినాల సమయంలో ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం నుంచి అడవి మార్గంలో కాలినడకన భక్తులు క్షేత్రానికి చేరుకుంటారు. ఆ సమయంలో అడవంతా శివ నామంతో మార్మోగుతుంది. ఎక్కడెక్కడి నుండో వచ్చిన భక్తులతో క్షేత్రం కిటకిటలాడుతుంటుంది. కిక్కిరిసిన భక్తులతో శ్రీగిరి శోభాయమానంగా విరాజిల్లుతుంటుంది

## దుర్గాభోయేశ్వర స్వామి సన్నిధి పేదల పెన్నిధి ,

గడివేముల,నంద్యాల జిల్లా గడివేముల మండలం గడిగేరేవుల గ్రామ పరిధిలోని ఏరుమల కొండల్లో వెలిసిన క్షేత్రం దక్షిణ కాశీగా పేరుపొందింది బుధవారం నాడు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు భక్తులు పెద్ద ఎత్తున క్షేత్రానికి వచ్చి పుణ్య స్నానాలు ఆచరించి పరమశివుని ప్రసన్న కొరకు పూజలు చేసి స్వామివారి అనుగ్రహం పొందారు మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఏటేటా వచ్చి దక్షిణ కాశీగా పేరుపొందిన ఈ క్షేత్రంలో తెల్లవారుజామున నిద్రలేచి శిరస్నానం చేసి సాంప్రదాయ దుస్తులు ధరించి శివునికి పూజ చేసి ఉన్నారు సమీప శివాలయాన్ని దర్శించుకుంటారు శివునికి ఎంతో ప్రీతికరమైన పత్రాలను తేనె మరియు ఆవు పాలు పంచామృతాలతో అభిషేకించి తన్మయత్నం చెందుతుంటారు రోజంతా ఉపవాసం చేసి శివనామ స్మరణతో రాత్రంతా మెలుకువగా ఉం డిమహాశివరాత్రి జాగరణ చేసి శివనామ స్మరణతో శివుని కృపను అనుగ్రహించుకుంటారుప్రధమకోనేరు నందుకొండ సిలువ హల్చల్ : మహాశివరాత్రి కోనేరులో కొండచిలువ హల్చల్ చేసింది మహాశివరాత్రి పర్వదినం రోజు దుర్గా భోగేశ్వర ప్రధమ కోనేరు నందు కొండచిలువ ఉండడంతో భక్తులు స్థానాల ఆచరించడానికి చాలా వీలుపడలేదు వచ్చిన భక్తులు కూడా చాలా భయభ్రాంతులకు గురయ్యారు విషయం తెలిసిన ఆలయ కమిటీ నిర్వాహకులు ఫారెస్ట్ అధికారులకు విషయం తెలియజేయడంతో హుటాహుటిన భోగేశ్వరం ప్రధమకోనేరు నందు ఉన్న కొండచిలువను అతి కష్టం మీద పట్టుకొని భక్తులకు ఊరట కలిగించారు ఆలయ సిబ్బంది ఫారెస్ట్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల వైద్య శిబిరం: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన దుర్గా భోగేశ్వరఆలయం నందు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఏటేటా మెడికల్ క్యాంపు నిర్వహించి భక్తులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా నిత్యం భక్తుల సేవలో ఉంటూ భక్తుల సేవలో దుర్గ భోగేశ్వరుడు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుల సేవలో భక్తులు అనే విధంగా ఈ మెడికల్ క్యాంపు నిర్వహించారు భోగేశ్వరుని సన్నిధిలో రక్షకబటులు మండల పరిధిలోని దుర్గా భోగేశ్వర ఆలయం నందు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి గడివేముల ఎస్సై నాగార్జున రెడ్డి తన సిబ్బందితో ఆలయ ప్రాంగణంలో బందోబస్తు నిర్వహించారు

## దద్దణాల చెరువు (జుర్రేరు ఎత్తిపోతల పథకం)కి తిరిగి ప్రాణం పోసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి...



బనగానపల్లె...బనగానపల్లె సమీపంలోని దద్దణాల చెరువు (జుర్రేరు ఎత్తిపోతల పథకం) ప్రాజెక్టుకు పునర్ వైభవం వచ్చింది.. వేల మంది అన్నదాతల కన్నీళ్లు తీర్చే ప్రాజెక్టుకు పట్టిన గ్రహణం వీడింది.. రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిగారు ఎంతో గొప్ప మనస్సుతో తన సొంత నిధులను వెచ్చించి.. ఈ ప్రాజెక్టుకు మోక్షం కల్పించి అన్నదాతల్లో మళ్లీ ఆశలు చిగురింపజేశారు.. ఆయన చూపిన చొరవతో ఈ ప్రాజెక్టుకు సంబంధించి పాడై మూలన పడ్డ 4 మోటార్లు ? పంప్ హౌస్ కు తిరిగి మరమ్మతులు చేపట్టడంతో.. మళ్లీ నేడు ఈ పథకం పట్టాలెక్కి, ఆ కాల్వ గుండా నీళ్లు పారడంతో అన్నదాతల ఆనందాలకు అవధులు లేవనే చెప్పాలి.. నేడు రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో, మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గారు దాదాపు రూ. 25.75 లక్షలు తన సొంత నిధులతో మోటార్లకు మరమ్మతులు చేసి ఈ ప్రాజెక్టు తిరిగి పునరుద్ధరింపజేయడంతో నేడు స్థానిక ప్రజలు, రైతులు సంతోషం వెల్లిబుచ్చుతున్నారు. 2018 లో తెదేపా హయాంలో నాడు ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డి గారు సుమారు రూ. 21 కోట్లు వెచ్చించి ఎంతో ప్రతిష్టాత్మకంగా దద్దణాల చెరువు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు.. దీనికి 13 కి.మీ దూరంలోని దద్దణాల ప్రాజెక్టుకు ఎస్సార్బీసీ ప్రధాన కాలువ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు పైపులను అనుసంధానం చేసి పథకాన్ని నిర్మించారు. కాల్వలో నీటి ప్రవాహం 227.18 మీటర్లు మేర నీరు ఉన్నా తంలించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఏటా వర్షా కాలంలో ఎస్సార్బీసీ కాలువకు 5 నెలలకు పైగా సాగునీటిని విడుదల చేస్తారు. ఎస్సార్బీసీ కాలువలోని సాగునీరును ఎత్తిపోసి దద్దణాల చెరువును నింపే విధంగా ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ఈ పదకం ప్రారంభించిన తొలి ఏడాది 2018 లో టీడీపీ అధికారంలో ఉండటంతో నీటిని చెరువులోకి విజయవంతంగా ఎత్తిపోసి, దద్దణాల చెరువును నింపడం జరిగింది.

## కనుల పండుగ గా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు :ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 26-శ్రీ కామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామి వార్ల దేవస్థానం మహానంది క్షేత్రంలో కనుల పండుగగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఒ ప్రకటనలో మాట్లాడుతూ , మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల 24.వ తేదీ నుంచి 01. వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం రావణ వాహన సేవ, రాత్రి నంది వాహన సేవ. మహా శివరాత్రి రాత్రి 10 గం. నుండి లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకము, రాత్రి 3 గం నుండి శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవము జరుగుతుం దని తెలిపారు. గురు వారం ఉదయం శేష వాహన సేవ, రాత్రి పుష్ప పల్లకి సేవ.శుక్రవారంఉదయంఅశ్వవాహనసేవ,సాయంత్రం రథోత్సవం, రాత్రి పుష్ప శయనోత్సవం. శని వారం ఉదయం మహా పూర్ణాహుతి నాగబలిపూజ, సాయంత్రం త్రిశూల స్నానం, ధ్వజ అవరోహణము, రాత్రి తెప్పోత్సవము ఉంటుందని ఈవో తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేసామని తెలిపారు.

## దాతల సహకారం ఎనలేనిది



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 26 - దాతల సహకారం ఎనలేనిది అని శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం కార్యనిర్వహణాధికారి. మరియు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం మార్కెట్ ప్రసాద్ మాట్లాడుతూ కాళహస్తి బ్రహ్మోత్సవాలకు 18 వ సారి కూరగాయలు వితరణ చేసిన నాకు కు ఆలయ ఈవో మరియు అధికారులు. అలాగే శ్రీ కాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూరగాయల దాతను గౌరవంగా ఆహ్వానించడం ఎంతో సంతోషాన్నించిందని మార్కెట్ ప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ కాళహస్తి లో దాతలకు అపూర్వ ఆదరణ గౌరవం ఇస్తున్నట్లు మార్కెట్ ప్రసాద్ తెలిపారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190